క్లుప్తంగా

మానసిక ఒత్తిడికి గురైతే ఫిట్స్



గర్భిణికి జాగ్రత్తలు తెలియజేస్తున్న డాక్టర్ శాంతి

కూడేరు: గర్భిణులు మానసిక ఒత్తిడికి గురైతే ఫిట్స్ వచ్చే అవకాశం ఉందని డాక్టర్ శాంతి తెలిపారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి గర్భిణులు వచ్చారు. డాక్టర్ శాంతి వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ యశోద, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహంలో సరస్వతి పూజ



వజ్రకరూరులో సరస్వతి పూజలో పాల్గొన్న విద్యార్థులు

వజ్రకరూరు: త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు చక్కగా రాసి మంచి ఫలితాలు సాధించాలని హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో సరస్వతి పూజ నిర్వహించారు. హాస్టల్‌వార్డెన్ శ్రీనివాసులు మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదోతరగతి పరీక్షలు విద్యార్థులు చక్కగా రాసి మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హాస్టల్ ట్యూటర్స్ మల్లికార్జున, క్రాంతి, మహబూబ్ బాషా, టెన్త్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పవిత్రమాసంలో శుభాల శుక్రవారం



మసీదులో జుమా నమాజ్‌లో నిమగ్నమైన ముస్లింలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో 28 మసీదుల్లో శుక్రవారం జరిగిన సామూహిక జుమా నమాజ్‌కు మసీదులు ముస్లింలతో కిక్కిరిశాయి. జుమా జోహర్ నమాజ్‌కు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రార్థనలు చేశారు. జుమా నమాజ్ అనంతరం ప్రత్యేక దువా జరిగింది. అంతకుముందు మసీదుల్లో ఇమామ్‌లు మాట్లాడుతూ రంజాన్ మాసం పొందిన ప్రతి ముస్లిం ఉపవాసాలు, ఐదు పూటల నమాజ్ విధిగా పాటించాలన్నారు.

కొలిచిన వారికి కొంగు బంగారం లక్ష్మీనరసింహస్వామి



ఉత్సవాలకు ముస్తాబైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

బొమ్మనహాళ్: మండలంలోని ఉప్పరహాళ్‌లో వెలసిన లక్ష్మీనృసింహస్వామి నమ్మిన వారికి కొంగు బంగారంలా, కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా అలరారుతున్నారు. లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవం ఈనెల 8న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. ఏటా మాఘమాసంలో జరగనున్న ఉత్సవాలు ముందుగా ఉద్దేహాళ్ వద్ద వేదావతి నదిలోను , అనంతరం ఉప్పరహాళ్ ఆలయం వద్దను జరుగుతాయి.

నేడు జాతీయ లోక్ అదాలత్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ జడ్జి జె.సుజన్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10:30 గంటలకు జరిగే లోక్ అదాలత్ ఉంటుందన్నారు.

వారపు సంత.. తప్పని అవస్థ

- మండుటెండలో మార్కెట్ నిర్వహణ
- నిలువ నీడలేదు. గుక్కెడు నీరూ దొరకదు
- వ్యాపారులకు ఇక్కట్లు



బళ్లారి రహదారిలోని వారపుసంతలో కనీస సౌకర్యాలు లేకపోయినా ఎండలోనే సరుకులు విక్రయిస్తున్న వ్యాపారులు

రాయదుర్గంటౌన్: పట్టణ,గ్రామీణ ప్రజల కోసం ఏర్పాటు చేసిన వారపు సంత మండుటెండలో నిర్వహిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేక వ్యాపారులు, కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. పట్టణ ప్రజలతో పాటు గ్రామీణుల అవసరాలు తీర్చే వారపు సంతపై మున్సిపల్ అధికారులకు చిన్నచూపు. మార్కెట్ సుంకం (జకాతి) వసూలుపై ఉన్న శ్రద్ధ కనీస సౌకర్యాలు కల్పించడంలో లేదు. పట్టణంలో ప్రతి గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు శాంతినగర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద, మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు కూరగాయల మార్కెట్ వెనుక ఓబుళాచారీ రోడ్డులో వారపు సంత జరుగుతుంది. వందలాది మంది రైతులు తాము పండించిన ఉత్పత్తులు తెచ్చి విక్రయిస్తుంటారు. తాజా సరుకులతోపాటు సరసమైన ధరలకు లభిస్తాయని వేలాది మంది ప్రజలు ఇక్కడికి వచ్చి వారానికి సరిపడా సరుకులు తీసుకెళుతుంటారు. వ్యాపారులు నీడ, తాగు నీటి సౌకర్యం లేక తల్లడిల్లుతున్నారు. వేసవి తీవ్ర పెరిగిన నేపథ్యంలో వ్యాపారుల పరిస్థితి మరింత ఘోరంగా ఉంది. ఒక వేళ సంత సమయంలో వర్షం వస్తే కూరగాయలను కాపాడుకొనేందుకు వారే పడే అవస్థలు అంతా ఇంతా కాదు. మరోవైపు సంతలో పశువుల బెడద తీవ్రంగా ఉందని వాపోతున్నారు. కూరగాయలు, సరుకులు విక్రయించేందుకు ఎలాంటి షెడ్లు, గాని షామియానాలను గాని ఏర్పాటు చేయకపోవడంతో అసౌకర్యాల నడుమ వ్యాపారులు చేసుకోవాల్సి వస్తోంది. ఎండలు, వానల నుంచి రక్షించుకునేందుకు గొడుగులు, దుప్పట్లను నీడగా చేసుకుంటున్నారు.

సంత ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య..

పట్టణంలో దాదాపు 70 వేలకు పైగా జనాభా ఉంది. ఇందులో సగం మంది శాంతినగర్ సంతలో, మరో సగం మంది ఓబుళాచారి రోడుల్లో జరిగే సంతకు తరలివస్తారు. రైతు బజారు లేకపోవడంతో కొనుగోలుదారులు సంతలపైనే ఆధారపడాల్సి వస్తోంది. సంత జరిగే రెండు ప్రాంతాల్లోనూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ట్రాఫిక్‌తో కొనుగోలుదారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సంతకోసం పట్టణంలో ప్రత్యేక స్థలాలు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు. సంత జరిగే ప్రాంతాల్లో పోలీసు సిబ్బంది ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని, ఓబుళాచారిరోడ్డు వద్ద జరిగే సంత మార్గంలో ఆటోలు రాకుండా నియంత్రిస్తే పరిస్థితి మెరుగుపడుతుంది.

సౌకర్యాలు కల్పించాలి



ప్రతి గురువారం శాంతినగర్‌లో జరిగే సంతకు కూరగాయలు విక్రయిస్తాం. ఇక్కడ కనీస సౌకర్యాలు లేవు. మండే ఎండలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కనీసం తాగునీటి వసతి కూడా ఉండదు. అంతేకాక కనీస అవసరాలు తీర్చుకనేందుకు సమీపంలో ఎక్కడా వసతి లేదు. ప్రస్తుతం ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచు కొని అధికారులు స్పందించి వసతులు కల్పించాలి.

– రత్నమ్మ, వ్యాపారి, రాయదుర్గం

గిట్టుబాటు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం



రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ ఉరవకొండ నుంచి పాదయాత్ర చేస్తున్న రైతు సంఘం నాయకులు

ఉరవకొండ: మిరప, పత్తి, పప్పుశనగ, జొన్నరైతులకు గిట్టుబాటు ధర కల్పించడంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఉరవకొండలోని క్లాక్‌టవర్ నుంచి సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకుల పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్రను ఉద్దేశించి రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రాంభూపాల్ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయాన్ని దండగ చేసి రైతులకు కనీస గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయ్యాయన్నారు. 2024–25 ఖరీఫ్, రబీ పంట నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం, ఇన్సూరెన్స్ ప్రకటించి, రైతులను ఆదుకోవాలన్నారు. మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం క్వింటా రూ.50వేలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రబీ సీజన్‌లో పప్పుశనగ సుమారు 57వేల హెక్టార్లలో సాగుచేస్తే అతివృష్టి, అనావృష్టితో తెబ్బతిని ఎకరాకు రెండు క్వింటాళ్లు నుంచి 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చిందన్నారు. పాదయాత్రలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి కృష్ణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి మధుసూధన్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, కార్యదర్శి బీహెచ్‌రాయుడు, రాజారామిరెడ్డి, పెద్దముస్తురు వెంకటేష్, శీనప్ప, మురళి పాల్గొన్నారు.

జీవనశైలిలో మార్పుతోనే వ్యాధులు

- ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి



ఎన్‌సీడీ సర్వేపై ఆరా తీస్తున్న జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి

కూడేరు: మారుతున్న కాలానికనుగుణంగా ప్రజల జీవన శైలి, ఆహారపు అలవాట్లతోనే వ్యాధుల బారిన పడుతున్నారని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణ స్వామి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక సచివాలయం-2 104 ద్వారా అందిస్తున్న వైద్య సేవలను పరీక్షించారు. ఎన్‌సీడీ సర్వే పురోగతిపై డాక్టర్ సౌమ్యారెడ్డి, సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేన్సర్‌ను అరికట్టేందుకు ఎన్‌సీడీ సర్వే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18 ఏళ్లు పైబడిన వారు 1,88,5713 మంది ఉండగా, ఇప్పటికి 6,19,978కి ఇంటింటా సర్వే ద్వారా స్క్రీనింగ్ టెస్టు చేశామన్నారు. స్త్రీలలో రొమ్ము , గర్భాశయ ముఖ ద్వార కేన్సర్ వస్తుందన్నారు. పురుషుల్లో నోటితో పాటు ఇతర భాగాలకు కేన్సర్ వచ్చే అవకాశాలున్నాయన్నారు. గుట్కాలు వేసుకోవడం, పొగతాగడం ద్వారా, కొన్ని రకాల కేన్సర్ వంశపారంపర్యంగా వస్తుందన్నారు. అనుమానితులను అనంతపురంలోని గవర్నమెంట్‌మెంట్ ఆస్పత్రికి రెఫర్ చేసి స్పెషలిస్టుల ద్వారా పరీక్షింపజేసి వ్యాధి నిర్ధారణ చేయనున్నట్లు ఆయన తెలిపారు. డాక్టర్ సౌమ్యా రెడ్డి, సూపర్ వైజర్ రవీంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ, కరీష్మా, ఏఎన్‌ఎం సుశీల, హెల్త్ అసిస్టెంట్లు మురళి, శివప్రసాద్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వైభవంగా గవిమఠ పీఠాధిపతుల అడ్డపల్లకీ ఉత్సవం



గవిమఠ పీఠాధిపతుల అడ్డపల్లకీ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గవిమఠం పీఠాధిపతులు జగద్గురు చెన్నబసవరాజేంద్ర స్వామి అడ్డపల్లకీ ఉత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. బూదగవిలోని పీఠాధిపతులు విడిది మంటపానికి చేరుకోగా, అనంతరం ప్రత్యేక వాహనంలో వెలిగొండ రహదారిలోని మంటపం వద్దకు ఊరేగింపుగా అడ్డపల్లకీని తీసుకొచ్చారు. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్ర స్వామి, ఆదోని చౌకి మఠం పీఠాధిపతులు కల్యాణస్వామిజీ, మఠం సహాయ కమిషనర్ కె.రాణి, ఏజెంట్ రాజన్నగౌడ్‌ల ఆధ్వర్యంలో పీఠాధిపతులకు పాదపూజ నిర్వహించారు. అనంతరం మైసూరు మహారాజ వారు బహూకరించిన బంగారు గండపేడారాన్ని పీఠాధిపతుల కాలుకు మఠం సహాయ కమిషనర్ రాణి తొడిగారు.



మఠం పీఠాధిపతికి గండపెండేరాన్ని తొడుగుతున్న మఠం సహాయ కమిషనర్ రాణి



అడ్డపల్లకీ ఉత్సవంలో మఠం ఉత్తరాధికారి, చౌకి మఠం పీఠాధిపతులు, తదితరులు

'దుర్గం' వాసికి మహిళా ధాత్రి పురస్కారం



మహిళా ధాత్రి పురస్కారంతో భారతిరోజాను సత్కరిస్తున్న నిర్వాహకులు

రాయదుర్గంటౌన్: చేంజ్ ఫర్ సొసైటీ స్వచ్ఛంద సేవలను గుర్తించి సంస్థ రాయదుర్గం టీమ్ సభ్యురాలు భారతిరోజాను వైఎస్సార్ కడప జిల్లా వివేకానంద సేవాశ్రమ ప్రతినిధులు మహిళా ధాత్రి పురస్కారంతో సత్కరించారు. ఈమేరకు శుక్రవారం కడప జిల్లా పోరుమామిళ్ల ఓబుళాపురంలోని స్వామి వివేకానంద సేవాశ్రమంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యక్రమం నిర్వహించారు. భారతి రోజాను సన్మానించి పురస్కారాన్ని అందజేసినట్లు చేంజ్ ఫర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జబీవుల్లా తెలిపారు.

కంటిచికిత్స శిబిరానికి స్పందన



కంటిపరీక్షలు చేస్తున్న శంకర్ ఆసుపత్రి సిబ్బంది

కణేకల్లు: కణేకల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటిచికిత్స శిబిరానికి స్పందన లభించింది. బెంగళూరుకు చెందిన ప్రముఖ శంకర కంటి ఆసుపత్రికి చెందిన కంటి వైద్యులు, సిబ్బంది కంటిచూపుతో బాధపడుతున్న వారికి పరీక్షలు చేశారు. 116 మందికి కంటి పరీక్షలు చేయగా శస్త్రచికిత్సకు 49 మంది ఎంపికై నట్లు మండల లయన్స్ క్లబ్ అధ్యక్షులు వేలూరు మరియప్ప తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కో ఆర్డినేటర్ యు. ఆనంద్‌రాజ్, కార్యదర్శి చాంద్‌బాషా, డైరెక్టర్లు ఆది, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత మెరుగు



సైన్స్‌డేలో విద్యార్థినిని అభినందిస్తున్న విదేశీ మహిళ బెన్నా

బెళుగుప్ప: వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత మెరుగు పడుతుందని తహసీల్దార్ షర్మిళ, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, ఎంఈఓ మల్లారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని సన్‌రైజస్ పాఠశాలలో కరస్పాండెంట్ మారెన్న జాతీయ సైన్స్‌డేను పురస్కరించుకుని సైన్స్ కిడ్స్ ఎంపోరియం, విద్యా వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కార్తీక్‌రెడ్డి, శ్రీనివాస విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీనివాసులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాగరాజు, ఉపాధ్యాయులు ఎర్రిస్వామి, రషీద, భారతి, నాగవేణి, మమత, సుకన్య, సంధ్య, మాలశ్రీ, శిరీష తదితరులు పాల్గొన్నారు.



సోలార్ సిస్టం ప్రాజెక్టు చేసిన విద్యార్థులను అభినందిస్తున్న తహసీల్దార్ షర్మిళ

గజలక్ష్మి ఆలయంలో పూజలు

రాయదుర్గంటౌన్: మల్లాపురం ఇందిరమ్మ కాలనీలో వెలసిన గజలక్ష్మి దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారికి అభిషేకాలు చేసి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ప్రతి శుక్రవారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేస్తారు. పట్టణంలోని దుగ్గిలమ్మ ఆలయం, దండుమారెమ్మ ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

మహిళలను గౌరవించాలి



ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం : మహిళలను గౌరవించాలని హెచ్‌ఎం భాస్కర్ తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ముందస్తు మహిళా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు భాస్కర్ మాట్లాడుతూ సమాజంలో మహిళలను గౌరవించాల్సి బాధ్యత అందరిపైనా ఉందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తూ సమాజం అంతా తమ వైపు చూసేలా విజయాలను సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మల్లికార్జున, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మహిళా దినోత్సవ ర్యాలీ

రాయదుర్గంటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీకి చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మెప్మా ఆర్‌పీలు హాజరవుతున్నట్లు చెప్పారు.

జగన్‌ను కలిసిన 'దుర్గం' నేతలు



బెంగళూరు ఎయిర్ పోర్టులో జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

రాయదుర్గం:వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బెంగళూరు విమానాశ్రయంలో రాయదుర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి, తనయుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, గుమ్మఘట్ట రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాచేపల్లి లక్ష్మిరెడ్డి, అఖిల భారత పద్మశాలి సెక్రెటరీ పొరాళ్ల రాజు కలిశారు. దుర్గం రాజకీయాలపై అధినేత వైఎస్ జగన్ తో మెట్టు కాసేపు చర్చించారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయండి

- ఉరవకొండ సమన్వయకర్త వై.విశ్వేశ్వర రెడ్డి



మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు సిద్ధారెడ్డి తదితరులు

కూడేరు: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త వై. విశ్వేశ్వర రెడ్డిని అనంతపురంలోని ఆయన స్వగృహంలో మండల ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడిగా ఎంపిక చేసినందుకు జల్లిపల్లి సిద్ధారెడ్డి విశ్వేశ్వర రెడ్డికి శాలువా కప్పి పూల మాలలు వేసి సన్మానించారు. విశ్వేశ్వర రెడ్డి మాట్లాడారు. పార్టీ బలోపేతానికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. సమస్యలతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు, రైతులకు పార్టీ తరఫున అండగా నిలవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నారాయణ రెడ్డి, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, నాయకులు రంగారెడ్డి, అక్కులప్ప, ఎర్రిస్వామి, ఆదినారాయణ, గురునాథ్ రెడ్డి, గీతమ్మ పాల్గొన్నారు.

రూ.19 వేల రికవరీకి ఆదేశం



ప్రజావేదికలో మాట్లాడుతున్న అధికారులు

గుమ్మఘట్ట: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.19 వేలు రికవరీ, రూ. 20 వేలు అపరాధ రుసుం విధించారు. మండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు 806 పనులకుగాను రూ. 14,94,41,328 ఖర్చు చేశారు. ఈ పనులపై గత నెల 24 నుంచి క్షేత్రస్థాయిలో తనిఖీలు చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ.19 వేలు రికవరీ చేయాలని, మరో రూ.20 వేలు అపరాధ రుసుం విధించాలని ఏపీడీ సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో విచరణాధికారి శివారెడ్డి, ఏపీఓ సురేశ్, ఎస్ఆర్పీ వెంకటేశ్‌నాయక్, ఎంపీపీ భవాని,ఈసీ అంజన్‌కుమార్, ఇంజనీర్ రాంకిశోర్, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, డీఆర్పీలు పాల్గొన్నారు.

సజావుగా శాస్త్రీయ సలహా మండలి సమావేశం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం సజావుగా 14వ శాస్త్రీయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నంద్యాల ఉపసంచాలకులు డాక్టర్ జాన్సన్ హాజరై మాట్లాడారు. 2024–25లో వ్యవసాయం, పాడిపరిశ్రమ అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత

బొమ్మనహాళ్: కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షల్లో గోవిందవాడ జెడ్పీహెచ్‌ఎస్ 8వ తరగతి విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఉపాధ్యాయులు సుధీర్, సుధాకర్ తెలిపారు. నిర్వహించిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో హైస్కూల్‌కు చెందిన హనుమేష్, కీర్తి అనే విద్యార్థులు పరీక్షల్లో అర్హత సాధించారన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

రాయదుర్గంటౌన్: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని చౌడేశ్వరీదేవి కాలనీలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి డ్రమ్ములు, టబ్బుల్లో ఉన్న లార్వా నీరు పారబోయించారు. కార్యక్రమంలో శానిటరీ సెక్రటరీ గంగమ్మ, హెల్త్ సెక్రటరీ నళిని శోభ, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, యశోద పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

డి హీరేహాళ్(రాయదుర్గం): గొడిశెలపల్లికి చెందిన ఉమేష్ అనే యువకుడు కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. డీ హీరేహాళ్ మండలం దొడగట్ట వద్ద గత నెల 29న జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉమేష్ గాయపడ్డాడు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు ఉమేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న టెన్త్ ప్రశ్నపత్రాలు

రాయదుర్గంటౌన్: మండల కేంద్రాల్లోని పోలీస్టేషన్లకు పదోతరగతి ప్రశ్నపత్రాలు చేరాయి. శుక్రవారం రెండో సెట్ ప్రశ్నపత్రాలు చేరాయి. పట్టణంలో 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ నాగమణి తెలిపారు. రాయదుర్గం అర్బన్, రూరల్ పరిధిలోని 25 ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లకు చెందిన 1,172 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు గ్రాండ్ టెస్టులను రాస్తున్నట్లు తెలిపారు.

సార్..న్యాయం చేయండి

కూడేరు: అరవకూరుకు చెందిన దివ్యాంగురాలు కె.లక్ష్మీదేవి శుక్రవారం తహసీల్దార్ మహబూబ్ బాషాను కలిసి న్యాయం చేయాలని వేడుకున్నారు. కూడేరు పొలం సర్వే నంబర్ 535లోని ప్రభుత్వ భూమిలో కొన్నేళ్లుగా చీనీ, వేరుశనగ పంటలు సాగు చేసుకుంటూ వస్తున్నామన్నారు. అహుడా వెంచర్ ఏర్పాటు చేస్తున్నాం.. భూమిని ఖాళీ చేయమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపచరిత కుంట ఆక్రమణలు తొలగించాలి

రాయదుర్గంటౌన్: ఆత్మకూరు వీధి ఉపచరిత కుంట ఆనుకొని అక్రమ కట్టడాలు, కుంట వద్ద జరిగే అసాంఘిక కార్యకలాపాలను అరికట్టాలని జాఫర్ షా వలి దర్గా నిర్వాహకులు, కాలనీవాసులు కోరారు. శుక్రవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. కుంట పక్కన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని పక్కా ఇళ్లు నిర్మించుకున్నట్లు తెలిపారు.